## వైద్య సేవలను వినియోగించుకోవాలని

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి



ఆర్టీసీ బస్టాండ్‌లో వైద్య సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

బిజినేపల్లి, జూలై 11: మండలంలోని పాలెం గ్రామంలోని బస్టాండ్‌లో ఆర్టీసీ ఉద్యోగుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య కేంద్రాన్ని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంత వైద్యానికి సంబంధించి ఎలాంటి సేవలు అందించేందుకైనా సిద్ధంగా ఉన్నానన్నారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, వనపర్తి ఆర్టీసీ డిపోలకు సంబంధించిన ఉద్యోగస్తులకు ఈ వైద్య కేంద్రం ద్వారా సేవలు అందించడం జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ఆర్ఎం శ్రీదేవి, డీఎం దేవరాజు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## పంటలను నమోదు చేసుకోవాలి

అచ్చంపేటరూరల్, జూలై 11 : వానకాలంలో పంటలను సాగుచేసిన రైతులు తమ గ్రామాల పరిధిలోని వ్యవసాయ విస్తీర్ణాధికారిచే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య సూచించారు. గురువారం మండలంలోని చౌటపల్లిలో రైతులు సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బొమ్మనపల్లిలో ఫర్టిలైజర్ డీలర్ గోపాల్‌కు సంబంధించిన ఫర్టిలైజర్ దుకాణంలో పలు రికార్డులను తనిఖీ చేసి పలు సలహాలు సూచనలు చేశారు. అదేవిధంగా సింగిల్ విండో కార్యాలయం ఆవరణంలో ఉన్న ఫర్టిలైజర్ గోదాంను సీఈవో ఎల్లయ్యతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవోలు విజయకుమార్, అనూష ఉన్నారు.

## పెంట్లవెల్లిలో మట్టి నమూనాల సేకరణ

పెంట్లవెల్లి, జూలై 11 : మండల కేంద్రం సమీపంలోని వ్యవసాయ భూముల్లో పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారులు మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా పెంట్లవెల్లి వ్యవసాయ విస్తరణాధికారి గోవింద్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో భూసార పరీక్షలను నిర్వహించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా పెంట్లవెల్లి మండలాన్ని అధికారులు ఎంపిక చేశారన్నారు. అందులో భాగంగా ఐదు ఎకరాలకు ఒక షాంపిల్ చొప్పున మట్టిని సేకరించి జడ్చర్ల వద్ద ఉన్న ల్యాబ్‌కు భూసార పరీక్షల నిమిత్తం పంపనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# కుటుంబ నియంత్రణ పాటించాలి

- అదనపు డీఎంహెచ్‌వో వెంకటదాసు
- ఆయా మండలాల్లో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీలు



నాగర్‌కర్నూల్ : ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో వెంకటదాసు

నాగర్‌కర్నూల్, జూలై 11: జనాభాను తగ్గించేందుకు కుటుంబ నియంత్రణ పాటించాలని అదనపు డీఎంహెచ్‌వో వెంకటదాసు అన్నారు. కుటుంబ నియంత్రణ పద్ధతిని పాటించాల ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం నాగర్‌కర్నూల్‌లో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ర్యాలీని అదనపు డీఎంహెచ్‌వో జెండా ఊపీ ప్రారంభించారు. ప్రధాన రహదారి పొడవునా కొనసాగిన ఈ ర్యాలీ ద్వారా ప్రజలకు జనాభా నియంత్రణపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో సమావేశమై పలు విషయాలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ కృష్ణమోహన్, నర్సింహ, మెడికల్ ఆఫీసర్ నారాయణస్వామి, ఏఎంవో శ్రీనివాసులు, డీపీవో రేణయ్య ఏఎస్‌వో శివకుమార్, హెచ్‌ఈవోలు, ఎంపీహెచ్ఏలు, ఏఎన్ఎంలతోపాటు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

**బిజినేపల్లిలో..**

బిజినేపల్లి, జూలై 11 : మండల కేంద్రమైన బిజినేపల్లి, పాలెం గ్రామాల్లో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న జనాభా నియంత్రణకు కుటుంబంలోని భార్య లేక భర్త తప్పనిసరిగా కుటుంబ నియంత్రణ పద్ధతిని పాటించాలన్నారు. జనాభా పెరుగుదలతో సామాజిక అనర్థాలకు దారి తీస్తుందని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కల్పన, సురేశ్, శ్రీనివాసులు, మంగ, మురళీగౌడ్, లీలావతి, సుజాత, జయమ్మ, పార్వతి తదితరులు ఉన్నారు.



బిజినేపల్లి : బిజినేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**అచ్చంపేటలో..**

అచ్చంపేట టౌన్, జూలై 11 : అచ్చంపేట పట్టణంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో తారాసింగ్ మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో సిద్దాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ భూపాల్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అశోక్ ప్రసాద్, శ్రీను, పర్యవేక్షణ సి బ్బంది, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

**లింగాలలో..**

లింగాల, జూలై 11 : మండలంలోని అంబట్‌పల్లిలో అంతర్జాతీ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో జనాభా పెరడం వల్ల జరిగే అనార్థాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ భారతి, హెల్త్ అసిస్టేంట్ మల్లేశ్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉన్నారు.

**పెద్దకొత్తపల్లిలో..**

పెద్దకొత్తపల్లి, జూలై 11: పెద్దకొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, సీహెచ్‌వో శ్రీనివాసులు, సూపర్‌వైజర్ బాలాజీసింగ్, ఏఎన్ఎంలు భాగ్యమ్మ, జ్యోతి, రేణుక, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

**వంగూరులో..**

వంగూరు, జూలై 11: జనాభాను అరికట్టి దేశాన్ని అభివృద్ధి చేసుకుందామని మండల వైద్యాధికారి డాక్టర్ శృతి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో సీహెచ్‌వో సుధాకర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, నర్సింగ్ అధికారి శైలజతో పాటు సూపర్‌వైజర్లు పద్మ, రోజమ్మ, మేషక్, విద్యార్థులు, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

## నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఉప్పునుంతల, జూలై 11 : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాలచందర్ సృజన గురువారం ప్రకటనలో తెలిపారు. 1-4-2023 నుంచి 31-3-2024 వరకు జరిగిన పనులపై తేదీ ఈనెల 1 నుంచి 11వ తేదీ వరకు ఆయా గ్రామ పంచాయతీల్లో తనిఖీ నిర్వహించమన్నారు. సభకు సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

## 'దుండగులను కఠినంగా శిక్షించాలి'

కొల్లాపూర్, జూలై 11: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లాలో 8 సంవత్సరాల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కొల్లాపూర్ వాల్మీకి సంఘం గౌరవ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు పరశురాముడు, రామచంద్రుడులు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కొల్లాపూర్ పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ మానవత్వం మరిచి అభం, శుభం తెలియని చిన్నారిపై గ్యాంగ్ రేప్ చేసి కృష్ణానది జలాల్లో వేసి హత్య చేయడం ఘోరమన్నారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్న దుండగులకు కఠిన శిక్షలు పడకపోవడంతోనే సమాజంలో భయం లేదని పేర్కొన్నారు. ఆత్యాచారంపై గతంలో మాజీ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొని మళ్లీ ఇలాంటి ఘటనలు పునరవృతం కాకుండా చూడాలన్నారు. సమావేశంలో వాల్మీకి సంఘం నాయకులు ఉన్నారు.

## గ్రూప్-1 పరీక్షలకు ఉచిత కోచింగ్

నాగర్‌కర్నూల్, జూలై 11 : టీజీపీఎస్సీ గ్రూప్-1(మెయిన్స్) సర్వీసెస్ ఎగ్జామినేషన్ కోసం ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి గోపాల్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం మైనార్టీ సంక్షేమశాఖ నియంత్రణలో పనిచేస్తున్న తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. నోటిఫికేషన్ నెం.02/2024, 19.02.2024లో (563) పోస్టుల కోసం టీజీపీఎస్సీ గ్రూప్-1 అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈనెల 19వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపారు. ఇదేనెల 22వ తేదీ నుంచి తరగతులను తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ హైదరాబాద్‌లో ప్రారంభమవుతాయన్నారు. ఈ మేరకు స్టడీ సెంటర్ హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

- గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్




సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

కొల్లాపూర్, జూలై 11: నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని అచ్చంపేట, కొల్లాపూర్ నల్లమల అడవీ ప్రాంతంలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గిరిజన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా వ్యాప్తంగా గిరిజన గ్రామాల్లో, పెంటల్లో, గూడెలల్లో, తండాల్లో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు సమగ్ర సర్వే నిర్వహించి సమస్యల ఆధారంగా దశలవారీగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆయుష్ ఆరోగ్య ప్రాప్తికి ధన్వంతరి హోమాలు

- శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానందస్వామి



హోమాలు చేస్తున్న భక్తులు

నాగర్‌కర్నూల్, జూలై 11: ప్రకృతి ఆరోగ్యం, సంపూర్ణ ఆయుష్, ఆరోగ్యప్రాప్తికి ధన్వంతరి హోమాలు ఎంతో మేలు చేస్తాయని శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానందస్వామి అన్నారు. చండీయాగం మహోత్సవంలో భాగంగా గురువారం సైతం కార్యక్రమాలు, హోమాలు, పూజలు కొనసాగాయి. సమాజంలో ఆర్థికాభివృద్ధికి జ్ఞానంతో కూడిన ధనప్రాప్తికి యక్షరాజు కుబేరున్ని విశేషమైన బీజ మంత్రాలతో హవన, హోమ కార్యక్రమాన్ని గురువారం భక్తులచే ఆచరింపజేశారు. దీంతో పాటు ఆయుష్య అభివృద్ధికి ఆరోగ్యం కోసం శ్రీవిష్ణు రూపం అయినటువంటి ధన్వంతరి అవతారాన్ని ఉద్దేశించి మహిమాన్వితమైన మంత్రాలతో హోమాలను చేయించారు శ్రీకృష్ణజ్యోతి స్వరూపానందస్వామి. యాగశాల కార్యక్రమాలను బ్రాహ్మణులు శాస్త్రం ప్రకారం యథోక్తంగా నిర్వహించారు. ఐదోరోజు గురువారం ఉదయం గోపూజ యాగశాల ప్రదక్షిణ మొదలు అత్యంత వైభవంగా వేదహోమాలు, చండీహోమాలు, రుద్రహోమాలు రామాయణం భాగవతా సుందరకాండ చతుర్వేద హోమాలు సామవేద యజుర్వేద, ఆధర్వణ, వేద రుగ్వేద, రుత్వికులు వేద మూర్తులైన బ్రాహ్మణులతో వేద మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. నిత్యపూజలతోపాటు హోమాలు సంతాన ప్రాప్తికి పుత్రకామేష్టి హోమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం చండీ సప్తశతీ హోమాలు, మహాలక్ష్మీ, పుత్ర కామేష్టి హోమాలు, సాయంత్రం 6 గంటలకు శ్రీచక్రఅర్చన, చండీఅమ్మవారికి పంచామృతాభిషేక సహిత లక్ష కుంకుమార్చన మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపా కటాక్షాలు పొందాలని కోరారు.

# విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సీఎం దృష్టికి తీసుకెళ్లాలని అదనపు కలెక్టర్‌కు వినతి




అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

నాగర్‌కర్నూల్, జూలై 11: తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం సమస్యలపై కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ సీతారామారావుకు అందజేశారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సీఎం కృషి చేయాలని, ప్రభుత్వం ప్రతినెలా మొ దటి తారీఖునే పెన్షన్ ఇస్తున్నందున వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నగదు రహిత వైద్య చికిత్స అందించే ఈహెచ్ఎస్ పథకం సక్రమంగా అమలు పరు స్తూ ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు కార్పొరేట్ ఆ సుపత్రుల్లో నగదు రహిత వైద్యం సత్వర మే అందించాలని కోరారు. మొదటి పే రివిజన్ కమిషన్ సిఫారసు మేరకు మూల వేతనంలో ఒకశాతం మినహాయించి ఈహెచ్ఎస్ సేవలందించుటకు నగదు రహిత వైద్య చికిత్స అందించుటకు ఏర్పాటు చేయాలని కోరారు. కమిటేషన్ ద్వారా పొందిన మొత్తాన్ని 15 సంవత్సరాల్లో రికవరీ చేయబడుతుంది కానీ, ప్రస్తుత వడ్డీ రేట్ల ప్రకారం పదేండ్లలో చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. ఈ విధానం ఇప్పటికీ కేరళలో 12 సంవత్సరాలకు తగ్గించుటకు చర్యలు తీసుకొందని గుర్తు చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు నాలుగు విడుతలు చేసి ఏకమొత్తంలో చెల్లించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి వెంకట్‌శెట్టి, మండల శాఖల నుంచి సురేందర్, బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, చెన్నయ్య, జిల్లా సీనియర్ సిటిజన్స్ సంఘం అధ్యక్షుడు వార్డెన్ చెన్నయ్య తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ఉదాసీనతతోనే దాడులు

- కల్వకుర్తిలో న్యాయవాదుల విధుల బహిష్కరణ



కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కల్వకుర్తి, జూలై 11: ప్రభుత్వ ఉదాసీనత వల్లనే న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రమణ ఆందోళన వ్యక్తం చేశారు. సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పై సిద్దిపేట టూటౌన్ ఎస్సై ఉమారెడ్డి దాడికి పాల్పడటాన్ని నిరసిస్తూ గురువారం కల్వకుర్తి బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో నిరసన చేపట్టి విధులు బహిష్కరించారు. ఈసందర్భంగా బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రమణ మాట్లాడుతూ భద్రాచలం ఘటన మరువకముందే సిద్దిపేట ఘటన జరగడం సిగ్గుచేటని మండిపడ్డారు. న్యాయవాదులపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరస న కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మణ్‌రాజ్, లక్ష్మణశర్మ, లక్ష్మీనారాయణ, వెంకట్‌గౌడ్, కృష్ణయ్య, అమరేందర్, వెంకట్‌రెడ్డి, వెం కటేశ్, నాగరాజు, జయంత్‌కుమార్, రాంగోపాల్, మల్లేశ్, ప్రశాంత్, శివకుమార్, శ్రీకాంత్, శ్రీను పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై పోలీసుల జులూం సరికాదు

వెల్దండ/అచ్చంపేటరూరల్, జూలై 11: జర్నలిస్టులపై పోలీసుల జులూం సరికాదని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోశ్, వెల్దండ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజుగౌడ్ అన్నారు. గురువారం వెల్దండలో వారు వేర్వేరుగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళన కార్యక్రమ కవరేజ్‌కి వెళ్లిన జర్నలిస్టులతో పోలీసులు దుర్భాషలాడడం, చొక్కా పట్టుకొని లాక్కెళ్లడం హేయమైన చర్య అన్నారు. ఓయూలో నిరుద్యోగుల ఆందోళన కార్యక్రమాన్ని కవరేజ్ చేస్తున్న జర్నలిస్టులపై పోలీసులు భౌతిక దాడులకు దిగడం అమానుషమని టీయూడబ్ల్యూజేహెచ్ 143 రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందునాయక్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. విధి నిర్వహణలో భాగంగా ఓయూ క్యాంపస్‌లో నిరుద్యోగులు ఆందోళన చేస్తున్న కార్యక్రమాన్ని కవరేజ్ చేస్తున్న ఓ న్యూస్ ఛానల్ ప్రతినిధి శ్రీచరణ్ చొక్కపట్టుకొని లాక్కెళ్లడం హేయమైన చర్య అన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి వెంటనే సదరు పోలీసులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జర్నలిస్టులు, విద్యార్థి సంఘం నాయకులు ఉన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు సన్మానం

కల్వకుర్తి, జూలై 11: కల్వకుర్తిలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో టాపర్‌లుగా నిలిచిన 19 మంది విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కల్వకుర్తి మండలంలో పదవ తరగతిలో టాపర్లను 10 పాఠశాలల నుంచి ఎంపిక చేశారు. ఎంపిక చేసిన విద్యార్థులకు గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదు పురస్కారంతో పాటు, ప్రోత్సహించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్, జిల్లా కార్యదర్శులు లక్ష్మీ నర్సింహ, శోభన్‌బాబు, రాఘువేందర్, డివిజన్ అధ్యక్షుడు రాజేందర్, కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, సదానందం, జీహెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**డాక్యుమెంట్ పోయినది**

జి. ఊర్మిళ భర్త జి. శశిధర్ రెడ్డి, వృత్తి: ఫార్మర్, వయస్సు: 44 సం॥లు, విల్లా నెంబర్:3, ఆర్.వి. నిమన్ కిస్మత్‌పూర్, హైదరాబాద్, నా యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్: 5028/2013 మరియు లింక్ డాక్యుమెంట్ నెంబర్: 3815/2008, 8683/1989, ప్లాట్ నెం. 08 మరియు 09, సర్వే నెంబర్: 239, మొత్తం గజాలు: 550, మరికల్ నుండి జిన్నారం మా ఇంటికి వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినవి, ఎవరికైన దొరికినచో ఈ నెంబర్లను సంప్రదించగలరు.
9347729789, 9849329789.

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

# బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



పెంట్లవెల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల బృందం

పెంట్లవెల్లి, జూలై 11 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఏడుగురి ఉపాధ్యాయులకు గురువారం పాఠశాల ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు నర్సింహ, అర్జున్‌గౌడ్, శ్రీధర్, మధుసుదన్‌శర్మ, నారాయణరెడ్డి, ప్రభావతి, భాగ్యమ్మ బదిలీపై వెళ్తుండడంతో వారిని సహఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా సందర్భంగా వీరి స్థానాల్లో పాఠశాలకు బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయుడు కురుమయ్యతోపాటు మరో నలుగురి ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సీవీరావు, జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రామకృష్ణ ఉన్నారు.

**అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు**

కల్వకుర్తిరూరల్, జూలై 11: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని హెచ్ఎం నెహ్రూప్రసాద్ అ న్నారు. గురువారం కల్వకుర్తి మండలం లింగసానిపల్లిలో పాఠశాల హెచ్ఎం నెహ్రూప్రసాద్ అధ్యక్షతన పా ఠశాల నుంచి బదిలీ అయిన హెచ్ఎం చంద్రశేఖర్ ఉపాధ్యాయులు మహేశ్వరీ, వెంకటేశ్, మహేశ్వరానికి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పూల మాలలువేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు

అమ్రాబాద్, జూలై 11 : పదర మండలంలోని ప్రైవేట్ పాఠశాలలకు మండల విద్యాధికారి బాలకిషన్ గురువారం నోటీసులు జారీ చేశారు. ప్రైవేట్ పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ నోటీసులలో జీవో నెంబర్ 51లో సూచించిన విధంగా పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, పారిశుధ్యం పాటించాలని, విద్యార్థులకు అన్ని తరగతులకు సరిపడే గదులు, ఆటస్థలం ఉండాలని, పిల్లలకు స్వేచ్ఛాయుత విద్యను అందించాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

## బాలల హక్కులను కాపాడుదాం

కోడేరు, జూలై 11 : బాలల హక్కులను కాపాడుదామని ఎఫ్ఆర్ డీఎస్ మండల కోఆర్డినేటర్ చంద్రయ్య అన్నారు. మండలంలోని తీగలపల్లిలో గురువారం ఫౌండేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ బాలల హక్కుల కోసం పని చేస్తున్నదన్నారు. బాల్య వివాహాలు మహిళా చట్టాలు బాలకార్మికులకు ప్రత్యేక శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసి అక్కడి నుంచి రెసిడెన్సియల్ పాఠశాలలకు చేర్పించామన్నారు. అనంతరం నిత్యావసర సరుకులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

లింగాల, జూలై 11 : మండల కేంద్రానికి చెందిన మాకం చిన్నరాములు ఇంట్లో చోరీ జరిగిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై జగన్‌మోహన్ కథనం మేరకు మాకం చిన్నరాములు రెండు రోజుల కిందట ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. గమనించిన దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి ఇంట్లో ఉన్న మూడు బీరువాలు పగలగొట్టి అందులో ఉన్న రూ.లక్షకు పైగా నగదు, నగలు, భూములకు సంబంధించిన పత్రాలు ఎత్తుకెళ్లారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## వేలంలో రూ.3.15లక్షల ఆదాయం

చారకొండ, జూలై 11: మండల కేంద్రంలో ప్రతి శనివారం జరిగే గొర్రెలు, మేకల సంతకు ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్ ఆధ్వర్యంలో గురువారం వేలంపాట నిర్వహించారు. చారకొండకు చెందిన గణేశ్‌గౌడ్ రూ.3లక్షల15వేలకు తైబజార్‌ను దక్కించుకున్నారు. జీపీకి రూ. లక్ష చెక్కును అందజేశారు. మిగిత డబ్బులు విడతల వారీగా జీపీకి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేలంపాటలో వచ్చిన ఆదాయం గ్రామ పంచాయతీ అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి గణేశ్ పాల్గొన్నారు.

## మద్దిమడుగుకు బస్సు ప్రారంభం

కల్వకుర్తి రూరల్, జూలై11: కల్వకుర్తి డిపో నుంచి మద్దిమడుగు పుణ్యక్షేత్రానికి శుక్రవారం నుంచి ప్రత్యేక బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తునట్లు కల్వకుర్తి టీఎస్ ఆర్టీసీ డీఎం సుభాషిణి గురువారం తెలిపారు. కల్వకుర్తి నుంచి కొండారెడ్డిపల్లి మీదుగా మద్దిమడుగుకు నడుపుతామని, అలాగే కల్వకుర్తి నుంచి చంద్రాయన్‌పల్లి-గోకారం వరకు ఉన్న బస్సు సర్వీసును చారకొండ వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు బస్సులను శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.

## పాలెం డిగ్రీ కళాశాలకు అటానమస్ గుర్తింపు

బిజినేపల్లి, జూలై 11: మండలంలోని పాలెంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ గుర్తింపు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ విద్యారాణి తెలిపారు. కళాశాల విద్యార్థులు అధ్యాపక బృందం ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం పాలెం గ్రామ నిర్మాత తోటపల్లి సుబ్రమణ్యాశర్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోనే అటానమస్‌కు గుర్తింపు పొందిన ఏకైక కళాశాల అని గుర్తు చేశారు. ఈ కళాశాలకు అటానమస్‌తో అదనపు మౌలిక వసతులు, విద్యార్థులకు వసతిగృహాలు, కొత్త కోర్సులు రావడంతో సిలబస్ రూపకల్పన, మూల్యాంకనం చేసుకొనే వెసులుబాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సురేందర్, కృష్ణయ్య, నాగరాజు, రాధాకుమారి, శివ, యాదగిరి, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఫినిషింగ్



కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

నాగర్‌కర్నూల్, జూలై 11 : బిజినేపల్లి మండలం వడ్డెమాన్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఫినిషింగ్ చేయడంతోపాటు అలుగును తొలగించిన వేమల శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం కలెక్టరేట్‌లో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. 30 ఏండ్ల కిందట వేసుకున్న బోర్లను స్వాధీనం చేసుకున్నాడని, ఈ విషయమై ఇరిగేషన్, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో కలెక్టరేట్‌లోని ఏవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 381లోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని వెంచర్ చేస్తున్నాడని ఆరోపించారు. అదేవిధంగా కేఎల్ఐ కాల్వ వద్ద రాకపోకలు నిలిపివేశాడని, రాజకీయ నాయకులు బలం చూసుకొని రైతులను బెదిరింపులకు గురిచేస్తున్నారని, వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని డి మాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశ న్న, రైతులు వీరస్వామి, సు దర్శన్, చిన్న కుర్మయ్య, శ్రీనివాస్, రత్నయ్య, సుబ్బ య్య, శేఖర్, రమేశ్, రాము లు, కుమార్, బంగారయ్య, శాంతయ్య, లక్ష్మయ్య, చంద్రయ్య ఉన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

కల్వకుర్తి/తిమ్మాజిపేట, జూలై 11: కల్వకుర్తి పట్టణం సుభాష్‌నగర్ కాలనీకి చెందిన వారణాసి అలివేలు కుటుంబానికి గురువారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. అలివేల అనారోగ్యంతో చనిపోవడంతో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సూచనతో సంస్థ ట్రస్ట్ ప్రతినిధి గణేశ్ రూ.3వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందించారు. అలాగే తిమ్మాజిపేట మండలం చేగుంటలో అనారోగ్యంతో మృతి చెందిన ముక్కిస్ బుచ్చిరెడ్డి కుటుంబానికి ప్రముఖ వ్యాపారవేత్త మారేపల్లి సురేందర్‌రెడ్డి తన ఎంఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని పంపించారు. గురువారం బీఆర్ఎస్ నేతలు కృష్ణారెడ్డి, చెన్నయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి మారేపల్లి సురేందర్‌రెడ్డి పంపిన ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ కల్వకుర్తి మండలాధ్యక్షుడు గణేశ్, కిశోర్, నాగరాజు, గణేశ్, కృష్ణ, వెంకటేశ్, హన్మంత్ ఉన్నారు.

**పేద విద్యార్థినీకి..**

కల్వకుర్తి, జూలై 11: కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఈసీ చదువుతున్న పేద విద్యార్థిని ఆదిలక్ష్మికి, కానిస్టేబుల్ వెంకోజీ బుధవారం రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆదిలక్ష్మి ఇంటర్ హెచ్ఈసీలో స్టేట్ ర్యాంకు సాధించిన విషయం తెలుసుకున్న కానిస్టేబుల్ వెంకోజీ( ఊర్కొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు) కళాశాలకు వచ్చి విద్యార్థిని అభినందించాడు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, అధ్యాపకులు వేణు, సదానందం, రమాకాంత్, మహబూబ్‌అలీ, మల్లేశ్, రాజేశ్, గిరిబాబు, పరశురాం, శ్రీనివాస్, లక్ష్మయ్య, సంతోశ్‌గౌడ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అచ్చంపేటరూరల్, జూలై 11 : మండలంలోని చెన్నారం గేటు సమీపంలో హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిపై టీవీఎస్ బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు మునుగోడు మండలం సింగారం గ్రామానికి చెందిన నిమ్మల లింగయ్య (60) టీవీఎస్ బైక్‌పై అచ్చంపేటకు వస్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. అచ్చంపేట ఎస్సై రాములు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.